క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి

దస్తురాబాద్: నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా వాటిని సంరక్షించాలని ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రేవోజీపేట, బుట్టాపూర్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండల నేపథ్యంతో మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. తెగుళ్లు సోకితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వారి వెంట ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కలిమి సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు బాదావత్ పూర్ణచందర్ నాయక్ పరామర్శించి రూ.ఐదువేల ఆర్థికసాయం అందించారు. సత్యం, నరేశ్‌గౌడ్, దేవేందర్, తులసినాయక్, రాజేశ్‌నాయక్, రామన్న, గంగన్న తదితరులు ఉన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: ఐకేపీ స్వయం సహాయక సంఘాలపై రూపొందించిన లోకోస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం భైంసాలోని ఐకేపీ కార్యాలయంలో యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లో స్వయం సహాయక సంఘాలు, మహిళలు, గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యల ఆర్థిక లావాదేవీల వివరాలు, సభ్యుల వ్యక్తిగత వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో శిక్షకులు జ్ఞాను, సుదర్శన్, దేవేందర్, పోశెట్టి, ముత్యం, తదితరులున్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

కుంటాల: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం ఉంటుందని భైంసా డిపో మేనేజర్ అమృత పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింబా(బి) గ్రామంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, దివ్యాంగులకు ఇస్తున్న రాయితీ సేవలను వివరించారు. సర్పంచ్ మల్లేశ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సిబ్బంది కిషన్, విజయలక్ష్మి, అంబదాస్, కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

గదుల బకాయిలు చెల్లించాలి

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో 2018లో వేలంలో గదులు దక్కించుకుని బకాయిలు చెల్లించని వారంతా రెండు రోజుల్లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు కోరారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాతోపాటు జీపు అడ్డా, అటవీశాఖ కార్యాలయం ముందు కాంప్లెక్స్ గదులను దక్కించుకున్న పలువురు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించకుంటే చర్యలు తీసుకోవడంతో పాటు గదులకు తాళం, సీలు వేస్తామని హెచ్చరించారు.

25న అద్దె గదులకు వేలం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ అద్దెగదులకు నిర్వహించాల్సిన బహిరంగవేలం అనివార్య కారణాలతో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈనెల 25న తిరిగి వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఓ ప్రకటనలో రత్నాకర్‌రావు తెలిపారు. పట్టణ పరిధిలోని 26 మున్సిపాలిటీ గదులకు ఆసక్తి గలవారు రూ.లక్ష డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



కానుకలు అందిస్తున్న సీరాజ్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని జామా మసీద్‌లో మండల కోఆప్షన్ సభ్యులు సీరాజ్ ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు బడేసాబ్, రైసుద్దీన్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా చూడాలి

ఖానాపూర్: వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా చివరిరోజు గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, పుప్పాల శంకర్, రాజిరెడ్డి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

చెరువును పట్టించుకునేవారేరి?

- 15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- నిర్మించిన ఏడాదికే దెబ్బతిన్న అలుగు
- సాగునీరు అందక రైతులకు ఇబ్బంది



ప్రధాన కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు



నీళ్లు లేక ఎండిన వెంకూర్ చెరువు ప్రాంతం

కుంటాల: మండలంలోని పాతవెంకూర్ సమీపంలో ఓలా వాగుపై నిర్మించిన చెరువు అధ్వానంగా మారింది. నిర్మించిన ఏడాదికే చెరువు అలుగుకు బుంగ పడటంతో నీరు నిల్వకుండా బయటకు వెళ్తోంది. దీంతో చెరువు ఆయకట్టు పరిధిలో ఒక్క ఎకరం కూడా సాగులోకి రావడం లేదు. మరోవైపు చెరువు నుంచి ఇష్టారీతిన నిర్మించిన కాలువలు ప్రస్తుతం ఆనవాళ్లు కోల్పోయాయి.

2006లో నిర్మాణం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదతో ఇసుక వెళ్లకుండా చూడటంతోపాటు కుంటాల మండలంలోని వెంకూర్, ఓలా, కుంటాల, అందాకూర్, విట్టాపూర్ గ్రామాల్లోని 1350 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.1కోటి47 లక్షల వ్యయంతో 2006లో చెరువు నిర్మించారు. అప్పట్లో రైతుల నుంచి 166 ఎకరాల భూమిని సేకరించి చెరువు నిర్మించారు. నిర్మించిన ఏడాదికే అలుగుకు బుంగపడింది. ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో నీరు నిలువడం లేదు.

నాసిరకంగా నిర్మాణం..

పాతవెంకూర్ చెరువు నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో ఏడాదికే అలుగుకు బుంగపడింది. ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎకరం కూడా సాగుకు నోచుకోవడం లేదు. మరమ్మతులు చేయిస్తే ఆయా గ్రామాల్లోని 3,600 మంది రైతుల భూములకు సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు చెరువు నిర్మాణానికి భూములిచ్చిన రైతులు మాత్రం అందులో తమ పంటలను సాగు చేసుకుంటున్నారు.

ఏటా యాసంగి సాగు డౌటే..

తమ గ్రామంలో చెరువు నిర్మించారని రైతులు ఆనందపడ్డారు. అలుగుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వేసవి రాకముందే చెరువు ఎండిపోతోంది. ప్రణాళికాబద్ధంగా కాలువలు నిర్మించకపోవడంతో తమ పంటల వద్దకు నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ భూములు బీళ్లుగా మారుతున్నాయని.. అధికారులు స్పందించి పంటలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

వేసవికి ముందే ఎండిపోతుంది



వెంకూర్ చెరువులో మా భూములు కోల్పోయాం. అందులో వేసవికి ముందే నీరు ఎండిపోతోంది. భూగర్భ జలాలు వృద్ధి చెందడం లేదు. పశువులకు కూడా తాగడానికి నీళ్లు లేవు. చెరువు నిర్మాణ పనులు ఇష్టానుసారంగా చేపట్టారు. – కర్ల బక్కన్న, ఓలా

పరిహారం అందలేదు



కాలువలు ఇష్టానుసారం నిర్మించడంతో నా రెండెకరాల భూమి కోతకు గురైంది. ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వలేదు. చెరువు నిర్మించిన తర్వాత ఎకరం కూడా సాగుకు నోచుకోలేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. – గుమ్ముల సాయన్న, వెంకూర్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఉన్నతాధికారులతో కలిసి చెరువు స్థితిగతులను తెలుసుకున్నాం. అలుగు మరమ్మతులు, కాలువల నిర్మాణం నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వారి నుంచి ఆదేశాలు రాగానే రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటాం. – రమేశ్, ఇరిగేషన్ ఏఈ

సామాజిక కార్యకర్త దాతృత్వం



చాక్‌పల్లిలో సరుకులు అందిస్తున్న మోతీలాల్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి(కె) గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మోతీలాల్ పటేల్ తన తండ్రి హిమ్మత్‌రావు పటేల్ జ్ఞాపకార్థం నిరుపేద ముస్లింలకు రూ.50వేల విలువైన నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. చాక్‌పల్లి, అర్లి(కే), కల్లూరు గ్రామాలకు చెందిన 120 పేద ముస్లిం కుటుంబాలకు గురువారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, ఆర్టీఐ సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం, షేక్ వకీల్, సద్దాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల నిరసన



నిర్మల్‌లో వీవోఏల సమ్మెలో పాల్గొన్న సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వీవోఏల సమ్మెను సందర్శించి మాట్లాడారు. పీఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా సౌకర్యం లేకుండా అభద్రతతో బతుకులు ఈడుస్తున్నారన్నారు. ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, నిర్మల్‌రూరల్ మండల అధ్యక్షురాలు గాయత్రి, హిందూజ, గోదావరి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో వీవోఏల సమ్మెకు ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ మద్దతు తెలిపారు. ఎంపీటీసీ సుధాకర్, సీఐటీయూ మండల కన్వీనర్ మహేశ్, ఉపాధ్యక్షురాలు హసీనా, కార్యదర్శి గౌతమ్, గజ్జారాం, లావణ్య, దేవన్న పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు భూక్య సురేశ్, వీవోఏలు మమత, కిషన్, మల్లయ్య, శ్రావణి, ప్రమీల, శ్వేత, శైలజ, కవిత, బలిరాం, జంగు, అంజన్న తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలో వీవోల సంఘ భవనంలో చేపట్టిన సమ్మెలో వీవోఏల సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, వీవోఏలు సంగీత, గంగాధర్, రాధ, శ్రీనివాస్, తిరుమల, అనిత, గంగన్న, సునీత, లక్ష్మణ్, రాజు, శైలజ, మధురాణి, అన్నపూర్ణ, దివ్య, మల్లేశ్, సాయన్న, రాములు, నారాయణ, పోశెట్టి, లత ఉన్నారు.

సోన్: మండల కేంద్రంలో నిరవధిక సమ్మెలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు సునిత, వివిధ గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నిరవధిక సమ్మెకు లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మెట దశరథ్ మద్దతు తెలిపారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్, నవీన్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో కృష్ణవేణి, మీనా, కవిత, శోభ, అనిల్ కుమార్, సాయన్న, రామగౌడ్, సాయి, ప్రవీణ్, రంజిత్, సురేశ్, రవి, అశోక్, లావణ్య, రాజు, పద్మ, గంగన్న పాల్గొన్నారు.

తానూరు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీవోఏల సమ్మెకు గురువారం బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. బీజేపీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌స్వామి, వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షుడు ముత్యం, శివరాం, లలిత, దిలీప్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలో నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిడాం శంభు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగెల్లి నర్సయ్య మద్దతుగా బైఠాయించారు. వీవోఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లావణ్య, గంగాధర్, నరేశ్ ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గురువారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కలిసి విన్నవించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పెంబి ఎంపీఓ రత్నాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజు, వర్మ, శ్రీనివాస్, అభిలాష్, ప్రవీణ్, అనూష, నరేశ్ తదితరులు ఉన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

ఖానాపూర్: సదర్మాట్ కాలువపై పెరిగిన పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లను తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను పట్టణంలోని తన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీఓ మల్లేశ్, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శంకర్, రాజిరెడ్డి, రాజగంగన్న, శ్రీనివాస్, ప్రదీప్ ఉన్నారు.

చెక్కులు పంపిణీ..

కడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్ 36 కల్యాణలక్ష్మి చెక్కులు, రూ.2.50లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జీవన్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, వేణుగోపాల్, లచ్చన్న ఉన్నారు.

మాజీ మంత్రి గడ్డెన్నకు నివాళి



గడ్డెన్న విగ్రహం వద్ద ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నేతలు

భైంసారూరల్: మాజీ మంత్రి గడ్డెన్న వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దేగాం గ్రామంలో గడ్డెన్న విగ్రహానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తన నివాసంలో గడ్డెన్న చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ చందు, తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: మాజీ మంత్రి గడ్డిగారి గడ్డెన్న వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ జెకె పటేల్, మురళీగౌడ్, సంతోష్ కులకర్ణి, తదితరులు గడ్డెన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఏఎస్పీ..

భైంసాటౌన్: పట్టణంలోని కుంట ఏరియాలో గురువారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, మురళీగౌడ్, పట్టణాధ్యక్షుడు ఫారూక్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సాంస్కృతిక కళాబృందం ఆధ్వర్యంలో గురువారం వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ఉదయం, సాయంత్రం పనిచేసుకోవాలన్నారు. టీం లీడర్ లక్ష్మణ్, నాయకులు పెద్ది నర్సయ్య, సిబ్బంది రమేశ్, రాజ్‌కుమార్, సాయి, సుదర్శన్, రఘు, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో గురువారం ముధోల్ ఎస్సై సాయికిరణ్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పవద్దని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఇష్టారీతిన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. వేధింపులకు గురైతే విద్యార్థినులు ఆందోళన చెందకుండా 100కు కాల్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్నయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: భూమి కోసం, భుక్తి కోసం పోరాడి అమరులైన ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. ఇంద్రవెల్లి అమరుల త్యాగాలను స్మరిస్తూ గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అమరుల త్యాగాలు చరిత్రలో మానని గాయంగా మిగిలిపోయాయన్నారు. ప్రభుత్వం నేటికి ఆదివాసీ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. అంకుష్‌రావు, ఎల్లయ్య, మోహన్, బాదు, తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు

కుంటాల: మండలంలోని ఓలా, కల్లూర్ గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా 2019– 2023 మార్చి వరకు చేపట్టిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కనీస్‌ఫాతీమా, పద్మాబాయి, మండల ఉపాధ్యక్షురాలు మౌనిక, ఎంపీటీసీ కట్ట రవి, డీఆర్పీలు జితేందర్, ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులు, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో గురువారం ఐదుగురు లబ్ధిదారులకు రూ.57,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ కనీష్ ఫాతిమా అందజేశారు.

సంక్షిప్త వార్తలు

కంటివెలుగు ప్రారంభం

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఒడ్నం సవిత, బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి ప్రారంభించారు. ఇందులో టీఆర్‌ఎస్ నాయకులు అనిల్, కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

కుంటాల: మండలంలోని మోదన్‌పూర్ గ్రామంలో గురువారం సహకార బ్యాంకు, నాబార్డు సౌజన్యంతో బీమా పథకాలపై గ్రామస్తులకు కళాకారులు అవగాహన కల్పించారు. కల్లూర్ బ్యాంకు మేనేజర్ సాజిత్, సీఈవో నాగభూషణ్, సూపర్‌వైజర్ అనిల్ కుమార్, కళాకారులు రమేశ్, నారాయణ ఉన్నారు.

తహసీల్దార్‌కు బర్డ్‌ఫీడర్ అందజేత

లక్ష్మణచాంద: మానవాళి మనుగడకు పశు,పక్ష్యాదులు అత్యంత కీలకమని పక్షి ప్రేమికుడు సిలారి నవీన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కవితారెడ్డికి బర్డ్ ఫీడర్‌ను నవీన్ అందజేశారు. ఎండల నేపథ్యంలో పక్షులకు నీరు, ఆహారం అందించి కాపాడుకోవాలన్నారు. ఇందులో ఏవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల మహిళలు బాబాను దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు.

సన్మానం

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ పూర్ణచందర్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. అంజాగౌడ్, శేఖర్‌గౌడ్, సత్యం, నరేశ్‌గౌడ్, కాశగౌడ్,వెంకటేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నికపై హర్షం

కడెం: ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యవర్గం ఎన్నికపై ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, ఉపాధ్యక్షుడు విలాస్, లింగన్న ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగిన జాతీయ మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్(మంచిర్యాల)ను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: ఇళ్లస్థలాలు, ఇళ్లు లేని పేదల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో అంకుశ్‌రావు, ఎల్లయ్య, శంకర్, లచ్చన్న, శ్రీనివాస్, మున్వర్, వర్మ, మోహన్, బాదు తదితరులు ఉన్నారు.

కడెం: నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.పది లక్షల ఆర్థిక సాయం అందజేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. సుదర్శన్, ప్రభాకర్, సరిత, రమాదేవి, తదితరులు ఉన్నారు.

ఈరోజు

స్వామీజీ రాక

ముధోల్: మండలంలోని ముద్గల్, న్యూముద్గల్, సరస్వతీనగర్‌కు శుక్రవారం అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ రానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి భైంసా విభాగం ఆధ్వర్యంలో సరస్వతీ నగర్‌లోని హనుమాన్ మందిరం ఆవరణలో నగర సంకీర్తన, అర్చన, హనుమాన్ చాలీసా పారాయణం, అర్ధ మండల మాలధారణ , స్వామీజీ ప్రవచనం అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో శుక్రవారం ఉదయం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని సర్పంచ్ ముత్తగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారని నాయకులు, అధికారులు రావాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళనం

లోకేశ్వరం: మండలం కేంద్రంలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల కన్వీనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని.. తరలిరావాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా

నారాయణ: విరూపాక్ష

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు సైడ్ మొరం మరిచారు



తానూరు: తానూరు శివారు ప్రాంతం నుంచి జౌలా(బి) గ్రామం వరకు నాలుగు నెలల కిందట రూ.80 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు. కానీ సదరు కాంట్రాక్టర్ బీటీ రోడ్డుకు ఇరువైపులా మొరం వేయడం మరిచారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రోడ్డుకు ఇరువైపులా మొరం పోయించాలని ప్రజలు కోరుతున్నారు.